## క్లుప్తంగా

### ఆంగ్లభాషపై విద్యార్థులకు అవగాహన



**గుంటూరు ఎడ్యుకేషన్:** ఏసీ కళాశాల ఎదుట ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం ఆంగ్ల అధ్యాపకుడు యు.పాలప్రసాద్ ఆంగ్లభాష ఉచ్చారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాటించాల్సిన మెలకువలతో పాటు ప్రిపోజిషన్స్‌ను విద్యార్థులకు అర్థమయ్యే విధంగా వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

### ముగిసిన బ్రహ్మోత్సవాలు



**నగరంపాలెం:** స్థానిక ఆర్.అగ్రహారంలో శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి దేవస్థానంలో ఈనెల 13 నుంచి మొదలైన బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. సాయంత్రం స్వామికి పరివార సామ్రాజ్య పట్టాభిషేకం, మహా వైశాఖ పూజ వైభవంగా నిర్వహించారు. భక్తులు హాజరై, స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో వంశ పారంపర్య ధర్మకర్త పన్నాల వెంకటబుచ్చి రామశాస్త్రి, కార్యనిర్వాహణ అధికారి(ఈఓ) పగడాల శివకోటేశ్వరరావు, అర్చకులు సంగాపు చందు, సంగాపు చిన్న, చింతపల్లి నరసింహారావు పాల్గొన్నారు.

### నెహ్రూకు ఘన నివాళి



**లక్ష్మీపురం:** జవహర్ లాల్ నెహ్రూ విధానాలు అనుసరణీయమని విశ్రాంత ఇంజినీర్ ఎస్.సదాశివం అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి ఆధ్వర్యంలో జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మేధావుల ఫోరం కన్వీనర్ పి.ఎస్.మూర్తి మాట్లాడారు. అనంతరం ఎన్టీఆర్ జయంతి సభ నిర్వహించారు.

### ఒకటిన హనుమజ్జయంతి

**తాడేపల్లి రూరల్:** మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని కొత్తూరు తాడేపల్లి, మారుతీ నగర్ శ్రీ దాసాంజనేయస్వామి దేవస్థానంలో జూన్ 1న హనుమజ్జయంతి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. హనుమాన్ జయంతి సందర్భంగా మే 30 గురువారం ఉదయం 7.30 గంటలకు మూల విరాట్‌కు పంచామృత అభిషేకం, శుక్రవారం ఉదయం మన్యుసూక్త సహిత హనుమత్ హోమం, సాయంత్రం 6 గంటల నుంచి సువర్చల సహిత దాసాంజనేయస్వామి కల్యాణ మహోత్సవం 1న దాసాంజనేయ స్వామికి ఉదయం తమలపాకుల పూజ, సిందూరార్చన, విశేష అర్చనలు, మధ్యాహ్నం 12 గంటలకు అన్న సమారాధన, సాయంత్రం 6 గంటలకు స్వామివారి గ్రామోత్సవం నిర్వహించనున్నామని తెలిపారు. భక్తులు హనుమజ్జయంతి ఉత్సవాల్లో పాల్గొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని పేర్కొన్నారు.

### ద్విచక్ర వాహనం చోరీ


**మంగళగిరి:** పట్టణంలోని భార్గవ పేటలో ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. భార్గవపేటకు చైతన్య అనే యువకుడు రోజు లాగే తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు పార్క్ చేసి మంగళవారం ఉదయం లేచి చూడగా కనిపించ లేదు. చోరీకి గురయిందని గ్రహించి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### నేటి నుంచి క్రికెట్ లీగ్ పోటీలు

**తెనాలి:** కేబీఎస్ అండ్ కేవీఆర్ క్రికెట్ లీగ్ పోటీలు బుధవారం నుంచి తెనాలిలో ప్రారంభం కానున్నాయి. స్థానిక వీఎస్సార్ అండ్ ఏవీఆర్ కాలేజీలో జరిగే పోటీల వివరాలను నిర్వాహకులు మంగళవారం ఎన్వీఆర్ ఇంజినీరింగ్ కాలేజి ఆవరణలో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. కాలేజి ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కేబీఎస్ అండ్ కైవైఆర్ క్రికెట్ లీగ్ గత ఎనిమిదేళ్లుగా తమ కాలేజీలో నిర్వహిస్తున్నట్లు గుర్తుచేశారు. జూన్ 6వ తేదీ వరకు జరిగే ఈ క్రికెట్ లీగ్‌ను జయప్రదం చేయాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్ మాట్లాడుతూ కావేటి యలమందరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కేబీఎస్ – కైవైఆర్ క్రికెట్ లీగ్‌ని నిర్వహించడం గొప్ప విషయమన్నారు. తెనాలి పట్టణ కృష్ణ బలిజ సంఘ అధ్యక్షుడు కావేటి వేణుగోపాల్ పర్యవేక్షణలో విజయవంతం చేయనున్నట్లు చెప్పారు. కృష్ణ బలిజ సంఘ పెద్దలు కావేటి విజయ భాస్కర్, కావేటి సాంబయ్య, కావేటి శ్రీనివాసరావు, రామారావు, నిర్వాహకులు సురేష్, శివరాం, వేణు, గోపి, శ్రావణ్, వెంకటేష్, కోటేష్ పాల్గొన్నారు.

# జీర్ణం.. జీర్ణం.. వాతాపి జీర్ణం

- వరల్డ్ డైజిస్టీవ్ డే నేడు
- అవగాహనతో జీర్ణకోశ వ్యాధుల కట్టడి
- ముందస్తు జాగ్రత్తలతో దరి చేరవు
- ఇంటి ఆహారంతో ఆరోగ్యానికి మేలు




**గుంటూరు మెడికల్:** ఆధునిక జీవన శైలి వల్ల నేడు పలువురు డైజిస్టీవ్ (జీర్ణ) సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. ఆధునిక జీవనశైలితో ప్రతి ఏడాది జీర్ణ సమస్యలు పెరిగిపోతున్నాయి. ప్రాథమిక దశలోనే వీటిని గుర్తించి అరికట్టకపోతే పెద్దపేగు క్యాన్సర్‌కు దారితీయవచ్చు. జీర్ణక్రియ సంబంధిత సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వరల్డ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఆర్గనైజేషన్ ఫౌండింగ్ 2004 నుంచి మే 29న వరల్డ్ డైజిస్టివ్ డే(జీర్ణ ఆరోగ్య దినోత్సవం) నిర్వహిస్తోంది. ఈ ఏడాది కొలొరెక్టల్ క్యాన్సర్(పెద్దపేగు క్యాన్సర్)పై అవగాహన కల్పించాలని డైజిస్టివ్ డే సందర్భంగా నిర్ణయించారు. ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

### పెద్దపేగు క్యాన్సర్‌కు దారి తీసే ప్రమాదం

జీర్ణకోశ సంబంధిత సమస్యల్ని ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స చేయకపోవడం ద్వారా అవి పెద్ద పేగు క్యాన్సర్‌కు దారి తీస్తున్నాయి. వ్యాధి సోకిన వారిలో ప్రాథమిక దశలో పొట్టకింద నొప్పి, పొట్ట బిగపట్టడం, మలవిసర్జన సమయంలో నొప్పి, మలద్వారం నుంచి రక్తస్రావం అవడం, కొన్నిసార్లు ఎక్కువగా విరోచనాలు అవడం, బరువు తగ్గిపోవడం, అలసట తదితర సమస్యలు కనిపిస్తాయి.

### జీజీహెచ్‌లో ఉచిత వైద్య సేవలు

గుంటూరు జీజీహెచ్‌లో జీర్ణకోశ సంబంధిత సమస్యల బాధితులకు ఉచితంగా అత్యాధునిక వైద్య పరికరాలతో కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా వైద్య సేవలు అందిస్తున్నారు. వారంలో మంగళవారం, శుక్రవారం గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య విభాగంలో సేవలు లభిస్తాయి. ప్రతిరోజూ 300 మంది వివిధ రకాల జీర్ణ సమస్యలతో వైద్యం కోసం వస్తున్నారు. అయితే, ప్రాథమిక దశలో వస్తే తేలిగ్గా చికిత్స చేయవచ్చని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టులు తెలియజేస్తున్నారు. జీజీహెచ్‌లో జీర్ణకోశ సంబంధిత సమస్యలకు ఆపరేషన్లు కూడా ఉచితంగా చేస్తున్నారు. గత ఏడాది గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఓపీ విభాగంలో 4,988 మంది, ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు 2,514 మంది చికిత్స పొందారు.

### జీవనశైలితో పెరుగుతున్న వ్యాధులు

ఆధునిక జీవన శైలి వల్ల జీర్ణక్రియ సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయి. ఇంట్లో ఆహారం తయారు చేసుకోకుండా ఎక్కువ శాతం హోటళ్లలో తినడం వల్ల వ్యాధులు సంక్రమిస్తాయి. ఉద్యోగం, చదువులు, కుటుంబ బాధ్యతలు, ఆర్థిక సమస్యలతో ఎక్కువగా ఒత్తిడికి లోనవడం ద్వారా సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

### తిన్న ఆహారం అరగకపోతే సమస్యలు

ఆహారాన్ని సరైన పద్ధతిలో తీసుకోకపోవడం వల్లే ఎక్కువగా జీర్ణ సంబంధిత సమస్యలు వస్తున్నాయి. మన పూర్వీకులు కూడా రాత్రిపూట 'గూట్లో దీపం.. నోట్లో ముద్ద అన్నట్లు' ఆహారాన్ని తీసుకునేవారు. తిన్న తర్వాత తాపీగా పొట్ట మీద చేతితో 'జీర్ణం.. జీర్ణం.... వాతాపి జీర్ణం' అనుకునేవారు. నేటి యాంత్రిక జీవనంలో ఆహారం సక్రమంగా జీర్ణం అవకపోవడం కూడా వ్యాధులకు కారణమవుతోంది. జీర్ణ వ్యవస్థ మనం తీసుకునే ఆహారాన్ని జీర్ణం చేసి అందులోని పోషకాల్ని రక్తంలోకి చేరుస్తోంది. రక్తం నుంచి కాలేయానికి అక్కడి నుంచి పోషకాలు శరీరంలోని వివిధ అవయవాలకు చేరడం ద్వారా మనిషికి శక్తి లభిస్తుంది. యాంత్రిక జీవనం వల్ల హడావుడిగా ఆహారం తీసుకోవడం, ఫాస్ట్‌ఫుడ్స్ ఎక్కువగా తీసుకోవడం ప్రమాదానికి దారి తీస్తోంది. నిర్ణీత వేళలు పాటించకుండా మసాలా దినుసులతో కూడిన ఆహారాలు ఎక్కువగా తీసుకోవడం ద్వారా జీర్ణ సంబంధిత సమస్యలు ఎక్కువగా ఉత్పన్నమవుతున్నాయి.

### ముందస్తు జాగ్రత్తలతో కట్టడి

ఆహారం తిన్న వెంటనే ఎట్టి పరిస్థితుల్లోనూ నిద్రపోకూడదు. సాధ్యమైనంత మేర రాత్రిపూట తొమ్మిది గంటల్లోగా భోజనం చేయాలి. చేసిన అనంతరం కొంతసేపు నడవడం ద్వారా జీర్ణక్రియ మెరుగు పడుతోంది. ప్రతిరోజూ ఒత్తిడి, ఆందోళన లేకుండా యోగా, నడక, కొద్దిపాటి వ్యాయామాలు చేయాలి. జీర్ణ వ్యవస్థకు హాని కలిగించే ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి.
– డాక్టర్ షేక్ నాగూర్‌బాషా, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు, గుంటూరు జీజీహెచ్



# చేతిరాత నైపుణ్యంతో జీవితంలో ప్రగతి



చేతిరాత శిక్షణ తరగతుల్లో రీసోర్స్ పర్సన్లతో ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఉప్పాల రామమోహనరావు

**ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు**

**గుంటూరు ఎడ్యుకేషన్:** చేతిరాత నైపుణ్యంతో చదువులో ప్రతిభ చాటడంతో పాటు జీవితంలో ప్రగతి సాధించవచ్చునని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. క్యాలీగ్రఫీ ఫ్యామిలీ ఆధ్వర్యంలో స్థంభాలగరువులోని చేబ్రోలు మహాలక్ష్మి– పుల్లయ్య నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులకు నిర్వహిస్తున్న చేతిరాత శిక్షణ తరగతులను ఆయన మంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, పొత్తూరు జెడ్పీ హైస్కూల్ గణితశాస్త్ర ఉపాధ్యాయుడు ఉప్పాల రామమోహనరావు సారథ్యంలోని శిక్షణ తరగతులకు హాజరైన వారిని ఉద్దేశించి మాట్లాడుతూ చేతిరాతను అందంగా తీర్చిదిద్దుకోవడం ద్వారా విద్యార్థులు చదువులో ప్రతిభ చూపగలరని తెలిపారు. చేతిరాతను మెరుగుపరచుకోవడం ద్వారా మానసికంగాను మార్పులు సంభవిస్తాయని, చదువుపై ఏకాగ్రత పెరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులందరు ఒక బృందంగా ఏర్పడి, చేతిరాత నైపుణ్యంపై తోటి ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని పాఠశాలల్లో విద్యార్థులకు శిక్షణ కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉప్పాల రామమోహనరావు మాట్లాడుతూ బుధవారం ముగియనున్న మూడు రోజుల శిక్షణ తరగతులకు 38 మంది ఉపాధ్యాయులతో పాటు 57 మంది విద్యార్థులు హాజరవుతున్నారని తెలిపారు. శిక్షణ తరగతుల్లో క్యాలీగ్రఫీ రీసోర్స్ పర్సన్లు తొరటి శ్రీనివాసరావు, బురాన్, ప్రసాద్, నాగమణి, శారద, నాగలక్ష్మి, రమాదేవి, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# ఘనంగా డాక్టర్ లక్ష్మణస్వామి జన్మదిన వేడుకలు



డాక్టర్ లక్ష్మణస్వామికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న డాక్టర్ సుష్మిత తదితరులు

**గుంటూరు మెడికల్:** శ్రేష్ఠ హాస్పిటల్స్ చైర్మన్, సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ వై. లక్ష్మణ స్వామి పుట్టినరోజు వేడుకలు మంగళవారం స్థానిక గుజ్జనగుండ్ల సెంటర్‌లోని హాస్పిటల్‌లో ఘనంగా నిర్వహించారు. ఆర్థోపెడిక్ సర్జన్‌గా ప్రాక్టీస్ ప్రారంభించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పలువురు వైద్యులు అభినందనలు తెలిపారు. హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ సుస్మిత మాట్లాడుతూ ఆర్థోపెడిక్స్‌లో డాక్టర్ లక్ష్మణస్వామి విశేషమైన సేవలందించారని చెప్పారు. ఆయన వైద్య సేవల్లో స్వర్ణోత్సవ వేడుకలు తమ హాస్పిటల్‌లో జరుపుకోవడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. సుదీర్ఘకాలంగా ఆయన అంకిత భావంతో చేసిన వైద్య సేవలు ఎంతో మంది వైద్యులకు ఆదర్శంగా నిలిచాయన్నారు. ఆయన 50 ఏళ్ల వైద్య చరిత్రను పలువురు వైద్యులు స్ఫూర్తిగా తీసుకుని వృత్తిలో రాణిస్తున్నట్లు వెల్లడించారు. హాస్పిటల్స్‌లో రోగుల సంరక్షణను మెరుగుపరచడంలో, వైద్య రంగాన్ని అభివృద్ధి చేయడంలో ఎంతో కీలకపాత్ర పోషించారని కొనియాడారు. మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సౌజన్య, డైరెక్టర్లు డాక్టర్ నాగార్జున గొట్టిపాటి, డాక్టర్ హేమసుందర్ అభినందనలు తెలిపారు.

# వయోజనులకు బీసీజీ టీకాలను వేయండి

**డెప్యూటీ డీఎంహెచ్ఓ అన్నపూర్ణ**



మాట్లాడుతున్న డెప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ అన్నపూర్ణ

**తెనాలిఅర్బన్:** వయోజనులందరికి బీసీజీ టీకాలు వేయాలని డెప్యూటీ డీఎం హెచ్ఓడాక్టర్ ఇ.అన్నపూర్ణ ఆదేశించారు. తెనాలి పరిధిలోని మెడికల్ ఆఫీసర్లతో టీబీ యూనిట్‌లో మంగళవారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 సంవత్సరాలు వయస్సు దాటిన ప్రతి ఒక్కరూ బీసీజీ టీకా వేయించుకునేందుకు అర్హులని చెప్పారు. ప్రభుత్వం మొదటి విడత కింద వృద్ధులకు వేయడం జరుగుతుందని పేర్కొన్నారు. రెండో విడత అందరికి టీకాను వేయనున్నట్లు చెప్పారు. టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ కలగొట్ల రాధిక మాట్లాడుతూ అర్హులు తమ పేర్లను సచివాలయంలో నమోదు చేయించుకోవాలని చెప్పారు. క్రమపద్ధతిలో అందరికి టీకాలు వేయడం జరుగుతుందని చెప్పారు. ఈ సమావేశంలో తెనాలి పరిధిలోని మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

# మున్సిపల్ రిజర్వు స్థలం ఆక్రమణకు కుట్ర

- సదరు స్థలంలో గతంలో మున్సిపల్ పార్కు
- ఖాళీ స్థలాన్ని అనుకుని శ్రీ వైకుంఠ శ్రీనివాసమూర్తి దేవస్థానం
- ఫిర్యాదుపై స్పందించిన నగరపాలక సంస్థ అధికారులు
- చుట్టూ ఫెన్సింగ్ వేసి చిల్డ్రన్ ప్లే ఎక్విప్‌మెంట్ ఏర్పాటు
- అధికారులను అడ్డుకున్న స్థానికులు



నిరసన కారులతో మాట్లాడుతున్న నగరపాలక సంస్థ అధికారులు

**నెహ్రూనగర్:** శ్రీనివాసరావుపేట 60 అడుగుల రోడ్డులో నగరపాలక సంస్థ రిజర్వు స్థలాన్ని ఆక్రమించుకుని వ్యాపారం నిర్వహించుకునేందుకు కొంత మంది స్థానికులు పన్నిన కుట్రను నగరపాలక సంస్థ అధికారులు అడ్డుకున్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో అధికారులు ఏం చేసిన పట్టించుకోరు అనే ధోరణితో కొందరు వ్యవహరించారు. దీనిపై ఫిర్యాదు అందడంతో నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగ అధికారులు స్థలం వద్దకు చేరుకుని చుట్టూ కంచె వేసే ప్రయత్నం చేశారు. దీంతో స్థానికులు అధికారులను అడ్డుకుని ఫెన్సింగ్ వేయవద్దంటూ ఆందోళనకు దిగారు.

**1986లో స్థలం కేటాయింపు**

1986లో శ్రీనివాసరావుపేటలో సుమారు 3,600 గజాల రిజర్వు సైట్ ఉంది. ఆనాడు గొలుసు కొండలరావు మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న సమయంలో భాగం శ్రీ వైకుంఠ శ్రీనివాసమూర్తి దేవాలయం నిర్మాణం చేసుకునేందుకు సుమారు 1,600 గజాల స్థలం అయ్యప్ప అనే పురోహితుడికి కౌన్సిల్ తీర్మానం చేసి కేటాయించారు. అయితే దీనికి ఆనాడు ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు రాలేదని అధికారులు చెబుతున్నారు. గుడిని అనుకుని సుమారు 300 గజాలకుపైగా మున్సిపల్ రిజర్వు స్థలం ఉంది. మిగిలిన స్థలంలో వాకింగ్ ట్రాక్, రిజర్వాయర్, శానిటరీ ఆఫీస్ ఉంది. గతంలో ఇక్కడ పార్కు ఉండేది. అయితే సదరు రిజర్వు స్థలంపై కొంత మంది స్థానికుల కన్ను పడింది. దానిని ఆక్రమించుకుని వ్యాపారం నిర్వహించేందుకు కుట్రలు పన్నారు. విషయం తెలుసుకున్న నగరపాలక సంస్థ అధికారులు అక్కడికి చేరుకుని చుట్టూ ఫెన్సింగ్ వేశారు.

**కల్యాణమండపం కట్టి వ్యాపారం చేసుకునేందుకు?**

శ్రీనివాసరావుపేట 60 అడుగుల రోడ్డులో కళ్యాణ మండపం కట్టి ఒక అసోసియేషన్ ఏర్పాటు చేసుకుని తద్వారా దాని మీద వచ్చే ఆదాయం తీసుకునేందుకు స్థానికంగా ఉండే కొంత మంది కుట్రపన్నారు. ఇందులో భాగంగా ఫండింగ్ కూడా రైజ్ చేసినట్లు సమాచారం. సదరు స్థలంలో ఉన్న గోడను పడగొట్టినట్లు సమాచారం. దీనిపై అధికారులకు ఫిర్యాదు అందడంతో అధికారులు మంగళవారం సదరు స్థలంలో ఫెన్సింగ్ వేసి దానిలో చిల్డ్రన్ ప్లే ఎక్విప్‌మెంట్ పెట్టేందుకు చర్యలు తీసుకున్నారు. దీంతో స్థానికులు వందల మంది అక్కడికి చేరుకుని దానిని అడ్డుకునేందుకు ప్రయత్నం చేశారు.

### కబ్జాదారుల వెంటే పోలీసులు!

ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో 144 సెక్షన్ అమలులో ఉంది. అయితే సదరు స్థలాన్ని మత పరమైన అవసరాలకు వినియోగించుకోవాలని సాకుతో అక్కడకు వందల మందికి పైగా చేరి నిరసన చేపట్టారు. అయితే 144 సెక్షన్‌లో ఎక్కడ కూడా గుమికూడదని తెలిసినప్పటికి పోలీసులు కూడా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారు. సదరు ప్రాంతంలో పోలీసుల వ్యవహార శైలి చూస్తుంటే కబ్జాదారులకు ఒత్తాసు పలికినట్లుగా కనిపిస్తోంది.



రాత్రి సమయంలో కూడా నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

# సీనియర్ పాత్రికేయుడు గోపాలకృష్ణ మృతి

**నేడు పెనుగుదురు పాడులో అంత్యక్రియలు**



గోపాలకృష్ణ(ఫైల్)

**తెనాలి:** ఆర్ఎన్ గోపాలకృష్ణగా చిరపరిచితులైన, పట్టణంలోని సీనియర్ పాత్రికేయుడు, అర్చక సంఘ రాష్ట్ర నేత రొంపిచర్ల నాగగోపాలకృష్ణమాచార్యులు(75) మంగళవారం సాయంత్రం మృతి చెందారు. అనారోగ్యానికి లోనైన ఆయన తిరుపతిలో కుమార్తె ఇంట్లో ఉంటూ అక్కడే చికిత్స తీసుకుంటున్నారు. ఆయనకు భార్య, ఐదుగురు కుమార్తెలు, మనుమ సంతానం ఉన్నారు.

భాషా ప్రవీణ చదివిన గోపాలకృష్ణ తొలుత పాత్రికేయ రంగంలోకి వెళ్లారు. రేపల్లె, తెనాలిలో ప్రముఖ పత్రికలకు విలేకరిగా దాదాపు పదేళ్లకు పైగా పనిచేశారు. విజయవాడ నుంచి వెలువడిన ఇంగ్లిష్ దినపత్రిక ప్లెడ్జికు కొంతకాలం విలేకరిగా ఉన్నారు. జర్నలిస్టు, సినీ నటుడు ఏవీఎస్‌తో కొంత కాలం కలిసి పనిచేశారు. ఏవీఎస్‌తో కలసి రసమయి సాంస్కృతిక సంస్థను ఏర్పాటు చేసి స్థానిక రాజకీయ నేత డాక్టర్ రావి రవీంద్రనాథ్‌తో కలసి పలు కార్యక్రమాలను నిర్వహించారు. రాష్ట్ర అర్చక సంఘంలోనూ క్రియాశీలంగా ఉంటూ అర్చక సమస్యల పరిష్కారంలో తన వంతు కృషి చేశారు. తెనాలి రామలింగేశ్వరపేటలోని ప్రాథమిక పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా చేరారు. ఉద్యోగం నుంచి రిటైరయ్యాక చుండూరు మండల గ్రామం పెనుగుదురుపాడులోని శ్రీచెన్నకేశవస్వామి దేవస్థానం అర్చకుడిగా విధులు నిర్వహించసాగారు. అక్కడే ఇల్లు ఏర్పాటుచేసుకున్నారు. గోపాలకృష్ణ భౌతిక కాయాన్ని తిరుపతి నుంచి పెనుగుదురుపాడు తరలించనున్నారు. బుధవారం ఆ గ్రామంలోనే అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

# మిర్చి వ్యర్థాల ఘాటు.. ప్రజారోగ్యానికి చేటు

- ఘాటుకు శ్వాసకోశ వ్యాధులకు గురవుతున్న పలు గ్రామాల ప్రజలు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న వైద్యులు



ప్రధాన రహదారి వెంట పడేసిన మిర్చి వ్యర్థాలు

**గుంటూరు రూరల్:** నిత్యం ప్రజలు తిరిగే ప్రదేశాల్లో మిర్చి వ్యర్థాలను కాల్చటం వల్ల కోరు(ఘాటు)తో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. గ్రామాల్లోని ప్రధాన రహదారుల వెంట, ఖాళీ స్థలాల్లో మిర్చి వ్యర్థాలను పడేసి అక్కడే రాత్రి సమయాల్లో కాల్చటం వలన కోరు వచ్చి కనీసం గాలికూడా పీల్చుకోలేక పోతున్నామని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంగళాయపాలెం శివారుల్లోని డంపింగ్‌యార్డు సమీపంలోని ఖాళీ ప్లాట్లలో మిర్చి విత్తనాల తయారీదారులు విత్తనాలు తయారు చేసుకునే సమయంలో గాలికి గ్రామంలోకి వచ్చే కోరుతో ప్రజలు శ్వాసకోశ ఇబ్బందులు పడుతున్నారని ఆరోపిస్తున్నారు. మిర్చియార్డులోని విత్తనాలు ఊడ్చి ఇక్కడకు తెచ్చి పడేయటం, వాటిని కాల్చటం వలన ప్రజలు శ్వాసకోస వ్యాధులకు గురవుతున్నారు.

**మిర్చి తొడిమెలు తెచ్చేదిలా..**

మిర్చి యార్డుకు ఎక్స్‌పోర్ట్ చేసే సంస్థలు కొన్ని నగర శివారుల్లోని నల్లపాడు, చల్లావారిపాలెం, వెంగళాయపాలెం, తురకపాలెం, ఓబులునాయుడుపాలెం, నాయుడుపేట, పొత్తూరు, లింగాయపాలెం ప్లాట్లు, లాలుపురం పరిసరాల్లో షెడ్‌లు ఏర్పాటు చేసుకుని మిర్చి తీస్తుంటారు. మిర్చి తొడిమెలు తీసిన అనంతరం మిర్చిని బస్తాల్లో తీసుకెళ్లి తొడిమెలను మాత్రం ఆయా గ్రామాల ప్రధాన వీధుల వెంట కుప్పలు కుప్పలుగా పడేస్తున్నారు. దీంతో పాటు రాత్రి సమయాల్లో వాటిని దహనం చేస్తున్నారు. ఈ క్రమంలో వాటినుంచి వచ్చే కోరుకు ప్రయాణికులతో పాటు సమీప గ్రామాల ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు.

**మిర్చి విత్తనాల తయారీతో ఇబ్బందులు**

మిర్చి యార్డులో మిరపకాయలు విక్రయాల అనంతరం నేలపై మిగిలిపోయి రాలిపోయిన మిర్చి విత్తనాలు ఊడుపు పేరుతో కొందరు కొనుగోలు చేస్తారు. వాటిని నాయుడుపేట, ఓబులునాయుడుపాలెం, వెంగళాయపాలెం, పొత్తూరు, చౌడవరం గ్రామాల శివారుల్లో పెద్దపెద్ద మిషన్‌లు ఏర్పాటు చేసి జల్లెడ పట్టి విత్తనాలు వేరు చేస్తుంటారు. ఈ విత్తనాలు తయారు చేసే సమయంలో గాలికి మిర్చి ఘాటుతో కూడిన దుమ్ము ఇళ్లల్లోకి చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అసలు మిర్చి విత్తనాలు తయారు చేసి వాటిని నేరుగా రైతులకు విక్రయిస్తారా లేక ఇంకా ఏమైనా చేస్తారా.. అవి నాణ్యమైనవా లేక నకిలీ విత్తనాలా అనే విషయం కనీసం వ్యవసాయ శాఖ అధికారులు, సంబంధిత అధికారులకు తెలియదంటే అతిశయోక్తి కాదు. విత్తనాలు ఏం చేస్తారని అధికారులు సైతం పట్టించుకోక పోవటంతో వాటిని కొందరు నూనె తీసేందుకు వాడతారని, కొందరు నకిలీ మిర్చి విత్తనాల్లో కలుపుతారని అంటున్నారు. ఒక పక్క నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోయి ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు ఉన్నాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# మధ్యాహ్న భోజన తయారీపై శిక్షణ

**మేడికొండూరు:** ప్రభుత్వ ఆదేశాల మేరకు మధ్యాహ్న భోజన సిబ్బందికి శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పర్వీన్ విచ్చేసి మధ్యాహ్న భోజనం తయారు చేసే నిర్వాహకులకు శిక్షణ ఇచ్చారు. అనంతరం పలు రకాల వంట పోటీలు నిర్వహించారు. పోటీల్లో కిరణ్‌కుమార్, కరీముల్లా, శ్రావణి, జిల్లా ఉప విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు, వంటలు పరిశీలించి సూచనలు చేశారు. పోటీల్లో విజేతలకు సిరిపురం, కొర్రపాడు, మేడికొండూరు పాఠశాలలకు చెందిన మహిళలకు మండల విద్యాశాఖ అధికారి అబ్దుల్ అలీం అభినందించారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, సుభాని పాల్గొన్నారు.

# శారీరక శుభ్రతతోనే ఆరోగ్యం



**ఫిరంగిపురం:** శారీరక శుభ్రతతోనే మహిళలకు ఆరోగ్యం చేకూరుతుందని డాక్టర్ ఫరీనా బేగం అన్నారు. మండలంలోని నుదురుపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో రుతుక్రమం ఆరోగ్యం, పరిశుభ్రత దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు రుతుక్రమం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. చేతులు శుభ్రంగా ఉంచుకోకోవాలని, మంచినీటి స్నానం చేయాలని చెప్పారు. ప్రతి నెలా రుతుక్రమం సక్రమంగా వస్తున్నదీలేనిదీ గమనించాలని, లేకుంటే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. అనంతరం ఆరోగ్య సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ వెంకటలక్ష్మి, పీహెచ్ఎన్ గాయత్రీదేవి, ఎంపీహెచ్ఎస్ అబ్దుల్ రెహమాన్, హెచ్ఈ నూర్ ఖాజాబీ పాల్గొన్నారు.

# నేడు జాబ్ మేళా



**తెనాలి అర్బన్:** ఇంటర్మీడియెట్ బోర్డు, ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ హెచ్‌సీఎల్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉదయం రైల్వేస్టేషన్ రోడ్డులోని వైష్ణవి జూనియర్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు హెచ్‌సీఎల్ కంపెనీ కో–ఆర్డినేటర్ పి.గురునాథ్ పేర్కొన్నారు. కళాశాలలో మంగళవారం జాబ్ మేళాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియెట్‌లో 75శాతం మార్కులు దాటిన బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ విద్యార్థులు, ఒకేషనల్ కోర్సు పూర్తి చేసినవారు అర్హులని తెలిపారు. మూడంచెల విధానంలో ఎంపిక ఉంటుందని, ఎంపికైన వారికి ఒక సంవత్సరం పాటు ట్రైనింగ్ ఇచ్చి అనంతరం హెచ్‌సీఎల్ ఉద్యోగిగా నియమించడం జరుగుతుందని చెప్పారు. ట్రైనింగ్ సమయంలో నెలకు రూ.10 వేలు, ఉద్యోగంలో చేరిన నాటికి నుంచి నెలకు రూ.14,500 ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రముఖ యూనివర్సిటీలో గ్రాడ్యుయేషన్ కూడా చదివేందుకు సంస్థ ఆర్థిక సాయం చేస్తుందని చెప్పారు. వివరాలకు గురునాథ్ మొబైల్ నంబరు 77807 54278కు సంప్రదించాలని చెప్పారు. కార్యక్రమంలో వైష్ణవి జూనియర్ కళాశాల డైరెక్టర్ పాటిబండ్ల శ్రీనివాసరావు, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.